# అత్తా-కోడళ్ళు

## చెన్ను సుశీలారామంత్రి

**సుబ్బరత్నం, సుబ్బారావు మధ్యాహ్నం భోజనం కానిచ్చి విశ్రాంతిగా మంచం మీద నడుం వాల్చారు. "ఏవండీ చిన్న కోడలి చేతి వంట ఎలా వుందంటారు?"**

"నాట్ బేడ్డూ.. ఎప్పుడూ నీ చేతి వంటలే కాకుండా ఇలా మధ్యమధ్యన కోడళ్ళ చేతి వంటలు రుచి చూస్తుంటే వెరైటీగా వుంటుంది. ఏమిటీ చంటిది ఏడుస్తోంది. విమల ఏం చేస్తోంది? నువ్వెళ్ళి చూడకూడదటే రత్నం?"

"కూడదు.. ఎందుకంటారా కోడలు రేపు అబ్బాయి ఉద్యోగం చేసే దగ్గరకెళ్ళిందనుకోండి అక్కడ ఆ పసిదాన్ని చూసుకోవాల్సింది తల్లేగదా? దాని తాలూకు ట్రైనింగేదో నేను ఇక్కడే ఇస్తున్నాను. తెలిసిందా? అన్నట్టు చెప్పడం మరిచాను. పెద్దాడి దగ్గర్నుండి లెట రొచ్చింది. వాడికేదో ట్రైనింగుందట. బెంగుళూరు వెళ్తున్నాట్ట. రావడానికి నాలుగు నెల్లు పడుతుందట."

"అలాగా మంచిదే. ట్రైనింగయ్యి వస్తే వాడికి జీతమూ పెరుగుతుంది. ప్రమోషనూ వస్తుంది. శుభం."

"ఇంతకీ నేను చెప్పొచ్చేదేంటంటే సాయంత్రం మీరు అలా బజారుదాకా వెళ్ళి పెద్దాడికి ఫోన్ చేసి రండి. వాడలా బెంగుళూరు ట్రైనెక్కే ముందే కోడల్ని మనవడ్ని ఇలా పంపించమని .. పిచ్చి వెధవ బాబిగాడు కళ్ళల్లో మెదుల్తున్నాడు. రెండ్రోజులుగా వాడే కల్లోకొస్తున్నాడని చెప్పండి."

"సరే అలాగే ఫోన్ చేస్తాలే."

← ← ←

"ఏంటీ నే చెప్పినట్టు పెద్దాడికి ఫోన్ చేసొచ్చారా? కోడల్నిక్కడికి ఎప్పుడు పంపిస్తున్నాట్ట?" బైటకెళ్ళి వచ్చిన భర్తనడిగింది రత్నం.

"ఆ.. ఆ..ఫోన్ చేసే వస్తున్నాను. మొగుడు బెంగుళూరులో వున్న నాలుగు నెలలూ కోడలు పుట్టింటికెళ్ళి కంప్యూటరు కోర్సేదో నేర్చుకుందామనుకుంటుందట."

"అలాగా ఆదో వంకగావును ఆవిడగారు పుట్టింట్లో తిష్టవేసుక్కుచోడానికి.. ఇంతకీ పెళ్ళాన్నెప్పుడు పంపిస్తానన్నాడు కమలాకరం?" అసహనంగా అడిగింది రత్నం.

"వుండవే ఒక్కోటీ చెప్పుకొస్తున్నాగా? మీ అమ్మకు బాబిగాణ్ణి చూడాలనుంది. ముందు కోడల్నిక్కడికే పంపించు. అంతగా ఐతే ఇక్కడ నాలుగు రోజులున్నాక, పుట్టింటికెళ్తుందిలే అన్నాను. సరే వచ్చే ఆదివారం కోడల్నక్కడ బండెక్కిస్తానన్నాడు. ఇక్కడ నన్ను స్టేషనుకెళ్ళి రిసీవ్ చేసుకోమన్నాడు."

← ← ←

ఆ రోజు కమల వచ్చింది. తోటికోడల్ని చూసిన చిన్న కోడలు విమల ముఖం వికసించింది.

"అక్కా బావున్నావా? బాబీ ఎలా వున్నావు నాన్నా?" ఆప్యాయంగా పలకరించింది విమల.

కాళ్ళూ చేతులూ కడుక్కొచ్చి విమల చంకలో వున్న పసిదాన్ని అందుకుంది కమల. "ఏంటీ విమలా! చిన్నూ ఇలాగై పోయింది? నెల పిల్లప్పుడు చూస్తే ఎంతో బొద్దుగా, ముద్దుగా వుంది ఇప్పుడు ఐదో నెల నడుస్తోంది గదూ? ఏంటీ హైద్రాబాదు నీళ్ళు పళ్ళేదా దీనికి? ఇంతకీ హైద్రాబాదు నుండి నువ్వెప్పుడొచ్చావు?"

"నేనా? అసలు నేనింకా హైద్రాబాదు వెళ్లందే...?"

"ఏంట్రా తోటికోడళ్లిద్దరూ పెరట్లోనే మీటింగు పెట్టేసుకున్నారు? ఇలా హాల్లోకొచ్చి మాట్లాడ్తే మేమూ వింటాం గదా? ఒరే బాబీ ఇలా రారా.." అంటూ మనవణ్ణి దగ్గరకి పిలిచింది సుబ్బరత్నం.

ఇంతలో విమల వంట గదిలోకెళ్ళి వడ్డన కార్యక్రమంలో పడింది. తోటికోడలికి సాయంగా కమలా వెళ్లింది.

కమల వచ్చిన మర్నాడే అత్తగారు రత్నం హడావుడిగా, కోడలి దగ్గరకొచ్చి "కమలా బాబిగాడ్ని తయారు చెయ్యి. ఈ రోజు చాలా మంచి రోజు. వాడ్ని గుడికి తీసుకెళ్ళి శాస్త్రులు గారితో అక్షరాభ్యాసం చేయించి, అట్నుండి



### ఎన్టీఆర్ సినిమా ఎందుకొద్దన్నట్లో!

జూనియర్ ఎన్టీఆర్ ప్రక్కన నటించడానికి స్నేహ తిరస్కరించిందని సమాచారం. అయితే ఎందుకు వద్దన్నదో మాత్రం తెలియరావడం లేదు. మాస్‌లో మంచి క్రేజ్ వున్న ఎన్టీఆర్ ప్రక్కనే అవకాశమొచ్చిందే భాగ్యంగా భావించే కొత్త హీరోయిన్లున్న యీ తరుణంలో స్నేహ అంది వచ్చిన అవకాశాన్ని జారవిడువడంలోని అంతర్యం మాత్రం తెలిసి రావడం లేదు. త్వరలో ఆమె పెళ్ళి చేసుకోబోతోందని, అందుకే ఆ అవకాశాన్ని వదులుకుందన్నది కొందరి వాదన. ఏది ఏమైనప్పటికీ ఇప్పుడు మాత్రం స్నేహ బాపూ 'రాధాగోపాళం' సినిమా షూటింగ్‌తో బిజీగా ఉంది.

బళ్ళో కూచోబెట్టి వస్తాను."

అర్థంగానట్టు చూసింది కమల.

"ఏంటే అలా చూస్తావు? కమలాకరం రావడానికి నాలుగు నెలలు పడుతుందిగదా అంతదాకా బాబిగాడ్నిక్కడి బళ్ళో చేర్పిస్తే నాలుగక్షరం ముక్కలబ్బుతాయి."

కమల షాక్ తిన్నట్టయింది. "అత్తయ్యా ఇక్కడ ఈ పల్లెటూళ్ళో వీధి బళ్ళో వీడ్ని జాయిన్ చేస్తారా?"

"హన్నా ఎంతమాటనేశావే? ఇక్కడ ఈ పల్లెటూళ్ళో వీధి బళ్ళో చదువుకునే నీ మొగుడు నీ మరిది అంతంత ఉద్యోగాలు వెలగబెడ్తున్నారన్నది మర్చిపోకు."

"అది కాదత్తయ్యా! నేనిక్కడ ఉండేది నాలుగు రోజులే. తర్వాత మా అమ్మగారి వూరెల్లిపోవాలి. అక్కడ కంప్యూటర్ కోర్స్‌లో జాయినవ్వాలి."

అప్పటికే, రత్నం ముఖ కవళికలు మారిపోయాయి. "అంటే ఏంటే నీ ఉద్దేశం? మొగుడలా ఆఫీసు పనిమీద వేరే వూరెళ్ళగానే చెంగుమంటూ ఇలా పుట్టింటికి చెక్కెయ్యడమేనా? అదీగాక తగుదునమ్మా అంటూ_ నలుగుర్లోకెళ్ళి ఆ కంప్యూటర్లవీ నేర్చుకోడం ఏంటి? ఐనా అన్నిటికీ మీ ఇష్టాలేనా? మీ పెత్తనాలేనా? మీ వెనకాల పెద్ద తలకాయలు రెండున్నాయి.. వాళ్ళతో ఆలోచించి వాళ్ళ అంగీకారం తీసుకుందామన్న ఇంగితమన్నా మీకు లేకపోయిందేం?"



అంతక్రితమే అక్కడికి చేరిన సుబ్బారావు భార్యకు వంత పాడాడు. "ఆ ఇంగితమేదో మన కొడుకు గాడిదకుండాలే, దీన్ననుకుని ఏం లాభం? ఏదన్నా అంటే అత్తా మామ.. కోడళ్ళని రాచిరంపాన పెట్టామంటారు."

"మావయ్యా నా మాట కాస్త అర్థం చేసుకోండి. నేను కూడా ఉద్యోగం చెయ్యాలనుకుంటున్నాను. ఈ రోజుల్లో భార్యాభర్తలిద్దరూ ఉద్యోగాలు చేస్తేనే సంసారం సజావుగా సాగుతూ కాస్త వెనకేసుకోగలుగుతున్నారు."

కోడల్ని మధ్యలోనే అడ్డుకుంది రత్నం. "ఆగాగు ఏంటే అన్నావు మొగుడూ పెళ్ళాం సంపాయిస్తేనే సంసారం సజావుగా నడుస్తూ కాస్తో కూస్తో వెనకేసుకోగలుగుతారా? అంటే నీ వుద్దేశం ఆడంగులు వూరి మీదబడి ఉద్యోగాలు చేస్తూ వూళ్ళేలకపోతే ఇంక ఆ కాపరాలు అడుక్కుతింటూ పోతున్నట్టేనా? అలాగైతే నేను ఏ ఉద్యోగం వెలగబెట్టి వూళ్ళేలేనే? ఏం నా సంసారం బావుండలేదా? నా పిల్లల్ని చదివించుకోలేదా? ఉద్యోగాల్లో పెట్టలేదా? తాతలు కట్టిన ఇంటిని పడగొట్టి పక్కా మేడ కట్టలేదా?" లా పాయింట్లు లాగుతూ, కోడల్ని నిలేసింది.

ఆ మాటతో కమల ఆవేశం తారాస్థాయికి చేరింది. "అత్తయ్యా మాటలు జారడం మీకే గాదు నాకు తెలుసు. కానీ ఎదుటి మనిషిని కించపరిచే విధంగా మాటల్తో హింసించడం సంస్కారంమనిపించుకోదు. మనవడ్ని చూడాలనుందని ఫోన్‌చేశారని అటు వెళ్ళాల్సిన ప్రయాణాన్ని ఇటు మార్చుకుని వచ్చినందుకు నాకు మంచి శాస్తే జరిగింది. మావయ్యా రేపటికి మా అమ్మగారి వూరికి ట్రైన్ టికెట్ తెచ్చిపెట్టండి." చెప్పేసి, కొడుకుని తీసుకొని పెరట్లోకెళ్ళిపోయింది.

సుబ్బారావు దంపతులు కోడల్ని దుమ్మెత్తి పోస్తూనే వున్నారు. మధ్యాహ్నం భోజనాలయ్యాక ముసలాళ్ళిద్దరూ నిద్దర్లోకి జారుకున్నారు. తోటికోడళ్ళిద్దరూ మాటల్లో పడ్డారు.

"అక్కా నువ్వొచ్చినందుకు ఎంతో ఆనందపడ్డాను. పదిరోజులుంటావని సంబరపడ్డాను. ఇక్కడ ఏం తోచక పిచ్చెక్కిపోతుందనుకో" మాట్లాడుతుండగానే, విమల కళ్ళల్లో నీళ్లు నిలిచాయి.

ఆప్యాయంగా ఆమె చేతిని తన చేతిలోకి

తీసుకుంది కమల. "విమలా నా మాటటుంచు. అసలు విశ్వం నిన్నిక్కడ ఇంతకాలం ఎలా వుంచేశాడు? అక్కడ తనకి ఇబ్బందిగా లేదూ?"

"ఆయన ఎంత ఇబ్బందిపడ్డా, అత్తయ్యా మావయ్య గురించి నన్నిక్కడ వుంచేస్తున్నారు. ఆడపిల్లలు లేరుగదా. కోడళ్ళనే కూతుళ్ళుగా చూసుకుంటున్నారు. అలాంటప్పుడు నువ్వు కొంతకాలం మా అమ్మానాన్నల దగ్గరుండి రావడమే సబబు అంటారాయన" దిగులుగా చెప్పింది విమల.

"ఏడ్చినట్టుంది మీ ఆయన లాజిక్కు. డెలివరీకి తీసుకు రావడం ఇక్కడికే తెచ్చి రెండు మూడు నెలలుంచి రేపోమాపో కంటా మనగా పుట్టింటికి పంపించి కన్నాక నెల్లోపలే ఇక్కడికి తీసుకొచ్చి ఏడో నెల వచ్చేవరకూ కోడరికం చేయించుకుని అక్కడ కొడుకులు హోటల్ కూడు తింటున్నా మా పద్ధతి ఇంతేనంటూ ఏడో నెల నిండుకుందనగా పంపిస్తారు. ఐనా వీళ్ళ పద్ధతులేంటో ఎవరికీ అంతుబట్టవు. మనల్ని బాధపెట్టకపోతే వాళ్ళే వచ్చి సరదాగా మనదగ్గర కొంతకాలం వుండి పోవచ్చుగదా? వీళ్ళేమో కొడుకుల ఎదుట ఎక్కడ లేని ప్రేమ నటిస్తూ వాళ్ళు లేని టైంలో మనల్ని ఇష్టమొచ్చినట్టు సాధిస్తుంటారు!"

"అమ్మదగ్గరైతే చంటిదాని పనంతా అమ్మే చూసుకునేది. ఇక్కడ దాని పనేగాకుండా వంట పని, ఇంటి పని కూడా చూసుకోవాల్సొస్తోందక్కా, హైదరాబాదు వెళ్ళినా ఈ పని నాకు తప్పదనుకో. అక్కడ ఆయన ఆ హోటలు భోజనంతో ఏం ఇబ్బంది పడుతున్నారో అన్న బెంగ ఓ పక్క, ఆయనకు దూరంగా వుండాల్సొచ్చిందన్న దిగులు మరో పక్క, అత్తయ్య మావయ్య గుళ్ళు గోపురాలంటూ తిరుగుతూ వాళ్ళ కాలక్షేపంలో వాళ్ళుంటారు. నాకేమో రోజులు గడవక పిచ్చెక్కేలా వుంటోంది." తన గోడు వెళ్ళబోసుకుంది విమల.

"మరి ఇంతకాలం నువ్వు అన్నీ వివరంగా విశ్వానికి లెటర్రాసి వచ్చి నిన్నిక్కడ్నుండి తీసుకుపొమ్మని చెప్ప లేదా?"

"అక్కా ఆ ముచ్చటా అయ్యింది. నే రాసిన లెటర్ని భద్రంగా తండ్రికి పంపించారాయన. అదిక్కడికి చేరి న్రోజు, ఎంతగా గొడవ సృష్టించారో. వీళ్ళు. చెయ్యెత్తి కొట్టలేదు గానీ ఇంక జీవితంలో ఆయనకేవిధమైన ఉత్తరాలు రాయకూడ దనేంత విరక్తి పుట్టేట్టు సూటిపోటి మాటల్తో నానా హింసా పెట్టేశారు" కళ్ళంట నీళ్ళు కారుతున్నా తుడుచుకోడం మర్చిపోయి మనసులోని బాధనంతా వెళ్ళబోసుకుంది విమల.


"విమలా డోంట్ వర్రీ. వీళ్ళెలాగూ ఈ జన్మకి మారరు. ఇంక మన మొగుళ్ళ బుద్ధులు కూడా అంత త్వరగా దార్లో పడవుగానీ మనమే మన బుద్ధులకు పదునుపెట్టి ఉపయోగించు కోవాలి" సాలోచనగా అంది కమల.

"అంటే ఏం చెయ్యాలి? అక్కా అదంత తేలికైన పనంటావా? అదే అత్త మామల్ని... భర్తల్ని బెదిరించి మనం గెలవగలమా?" బెదురుగా చూసింది విమల.

"అబ్బా విమలా! అన్నిటికీ ఎందుకూ భయపడతావ్? మొదటగా నువ్వు నీ మనసు లోంచి భయాన్ని వెళ్ళగొట్టు. రేపే మనం మన అమ్మగారిళ్ళకు వెళ్ళిపోదాం. నా కోసం మా ఆయన, నీ కోసం మీ ఆయనా వచ్చేంతవరకూ మనం అక్కడే వుందాం."

షాక్ తిన్నట్టు చూసింది విమల. "అమ్మో ఏంటక్కా ఇలాగంటున్నావు? మనం అలా చేస్తే అనక ఎటుబోయి ఎటొచ్చినా .. చిలికి చిలికి గాలివానయ్యి కాపురానికి నీళ్ళొదులు కోవాల్సొస్తుందేమో!"

"విమలా కాపురం గురించి నువ్వు ఎలాంటి శంకలూ పెట్టుకోకు. అంతలా తుమ్మితే వూడిపోయే ముక్కులాంటి కాపురాన్ని పట్టుకుని ఎంతకాలమని వేలాడుతూ కూచుంటాం? ఐనా, మనకేగాని, మన మొగుళ్ళకు మనవసరం లేదంటావా? అంత కాని పనేం చెయ్యడం లేదే మనం? ఎప్పుడో ఒకప్పుడు ఈ సమస్యకి ఫుల్‌స్టాప్ పెట్టక




తప్పదు. ఇహ ముందు ఎప్పుడైనా మనం ఇక్క డికి రావాలంటే మన హజ్‌బెండ్స్‌తోనే వద్దాం. అంతేగానీ, విడిగా ఒక్కళ్ళం వచ్చి నెలల తరబడి వుండేది జరగని పనని ఖచ్చితంగా చెప్పేద్దాం. చూడు విమలా! అంతగా నీకు ఇష్టం లేదంటే నువ్విక్కడే పడుండు. నేను పోతాను" నిష్కర్షగా చెప్పేసింది కమల.

"అక్కా నీతోబాటే నేను. నన్ను వేరు చెయ్యకు. కష్టమో సుఖమో ఇద్దరం కలిసే అనుభవిద్దాం."

"దట్స్ గుడ్. అంతా మనకు మంచే జరుగుతుంది. నువ్వు నిశ్చింతగా వుండు." తోటికోడలికి ధైర్యం చెప్పింది కమల.

తోటికోడళ్ళిద్దరూ ఓ నిర్ణయానికి వచ్చి ఆ రాత్రి పడుకున్నారు. సగం రాత్రప్పుడు అత్తగారి గొంతు గట్టిగా ఏడుపు వినిపించ డంతో వులిక్కిపడి లేచి గాభరాగా వెళ్ళారు కమల, విమల. బాత్‌రూంలో కాలుజారి పడిపోయి వుంది సుబ్బరత్నం. కోడళ్ళిద్దరూ కలిసి ఆమెను పైకి లేపబోయారు. కానీ. ఆమె కాలు ఫ్రాక్చరవ్వడం వల్ల కాస్త కూడా పైకి లేవలేకపోయింది. ఇద్దరూ అతి కష్టం మీద అత్తగారిని పైకి లేపి మెల్లగా సాయం పట్టి తీసుకెళ్ళి గదిలో మంచం మీద పడుకోబెట్టారు. పెద్దగా గురకపెట్టి నిద్రబోతున్న మామగార్ని లేపారు.

"ఏంటీ అర్ధరాత్రి అంకమ్మ శివాలు. ఏంటీ గోల?" విసుక్కుంటూనే కళ్ళు విప్పాడు సుబ్బారావు.

"మీకు గోలగానే వుంటుంది. బాత్రూంలో కాలు జారిపడి నేనేడుస్తున్నాను. అయ్యో నా కాలు విరిగినట్టుంది" సుబ్బరత్నం బాధపడి పోతోంది.

"జారి పడితే విరగదు మరీ? ఐనా జాగ్రత్తగా చూసుకొని నడవద్దటే రత్నం? పదారేళ్ళ పడుచుపిల్లలా చెంగు చెంగు మంటూ దూకుడుగా నడిచే వయస్సా నీది? నేనెప్పుడూ చెప్తూనే వుంటాను. అబ్బే నా మాట చెవులకెక్కించుకుంటే గదా! చూడు ఇప్పుడేమయ్యిందో" సుబ్బా రావు భార్యను దెప్పి పొడిచాడు.

"మావయ్యా మాటలు తర్వాత ముందు మీరు వెంటనే వెళ్ళి డాక్టర్ని తీసుకురండి." కమల అంది. కోడళ్ళిద్దరూ అత్తగారి కాలుకి తడి బట్ట చుట్టి మెల్లగా నిమురుతున్నారు.

"ఇప్పుడా డాక్టర్ని తీసుకొస్తే

సమయంలో ఎవరొస్తారు? తెల్లారాక వెళ్ళి పిల్చుకొస్తాలే" లేచి మంచం మీద కూచున్న వాడల్లా ఆవలిస్తూ తిరిగి మంచం మీద వాలిపోయాడు సుబ్బారావు.

"అక్కా ఇప్పుడు మావయ్యగారెళ్ళి డాక్టర్ని లేపి తీసుకురావాలంటే చాలా టైం పడుతుంది. అదీగాక ఇక్కడ సరైన డాక్టరే లేరు. మనమే అత్తయ్యగార్ని టాక్సీలో నేరుగా పట్నంలో వున్న ఎముకల డాక్టరు దగ్గరకు తీసుకెళ్తే బావుంటుంది గదా?"

"అవును విమలా నువ్వు చెప్పింది బావుంది. మావయ్యా! మీరు వెంటనే వెళ్ళి టాక్సీ తీసుకు రండి. విమలా! నువ్వు పిల్లల్ని చూసుకుంటూ ఇంటి దగ్గరే వుండు. అత్తయ్యను తీసుకొని నేనూ మావయ్యా వెళ్తాం."

❋ ❋ ❋

సుబ్బరత్నాన్ని ఆస్పత్రిలో అడ్మిట్ చేసుకున్నారు. అక్కడ ఎక్స్‌రే లాంటివి అన్ని టెస్టులూ చేశాక ఆమె కాలికి సిమెంటు కట్టు కట్టారు. నాలుగు రోజులు ఆస్పత్రిలో వుంచి అవసరమైన మందులు రాసిచ్చి బెడ్ రెస్ట్‌లో వుండాలనిచెప్పి పేషెంటుని ఇంటికి పంపేశారు. రత్నం దగ్గర కాస్త సాయంగా వుండేందుకు ఎవరినైనా మనిషిని పెట్టుకుందామని ఎంత ప్రయత్నించినా కుదరలేదు. చేతల సాయం మాటటుంచి, కనీసం మాటల సాయంగానన్నా ఎవరూ రాలేదు. ఏనాడూ పిల్లికైనా బిచ్చం పెట్టని, ఎంగిలి చేత్తోనన్నా కాకిని విదల్చని ప్రత్యేకమైన కేరెక్టర్స్ సుబ్బరత్నం, సుబ్బారావులది.

❋ ❋ ❋


"ఇదిగో రత్నం.. ఇప్పుడు నాకోటనిపిస్తోందే.. నిన్నిలా మంచానబడి మగ్గేలా చెయ్యాలని ప్లానేసుకునే కోడళ్ళిద్దరూ బాత్రూం శుభ్రంగా కడక్కుండా నువ్వు జారిపడేట్టు చేశారని నా అనుమానం."

"ఇప్పటిదాకా మూటగట్టుకున్న పాపం చాలు. ఇహనైనా మనుషుల్లా ఆలోచిస్తూ మంచిగా బతుకుదామండీ" పశ్చాత్తాపపడుతున్నట్లుగా చెప్పింది సుబ్బరత్నం. అంతటితో ఊరుకోక ఇంకా "కట్టుకున్నవాడికి లేదు. కన్న కొడుకులకు లేదు నా పట్ల బాధ్యత. ఎవరో పరాయి అమ్మ కన్న బిడ్డలు కోడళ్ళకేం పట్టిందండీ నాకు చాకిరీ చెయ్యాల్సిన ఖర్మ? అందునా ఏనాడూ మనం వాళ్ళని ఎప్పుడూ ప్రేమగా అభిమానంగా, చూసిన పాపాన పోలేదే.. అలాంటిది వాళ్ళు నన్నెందుకు చూడాలి? నిన్ను చూడాల్సిన అవసరం మాకేంటని నన్నీ స్థితిలో వదిలి వాళ్ళ దార్ని వాళ్ళుబోతే మనం వాళ్ళనేవన్నా చెయ్యగలమా? కానీ నా కోడళ్ళు అలా చెయ్యలేదు. పసిపాపని చూసుకుంటున్నంత అపురూపంగా నన్ను చూసుకుంటున్నారు. అన్నం కలిపి ముద్దలు నోటికందిస్తున్నారు. తడిబట్టతో ఒళ్ళు తుడిచి పౌడరద్ది బట్టలు మారుస్తున్నారు. ఆఖరికి కాలకృత్యాలు పక్కమీదే కానిస్తే అసహ్యించుకోకుండా తీసి శుభ్రం చేస్తున్నారు. చెప్పండి అలాంటి దేవతలకు ఏమిచ్చి ఋణం తీర్చుకోగలమంటారు? కబురందుకుని వచ్చిన కన్నబిడ్డలు నన్ను చూసి శలవు లేదంటూ వెంటనే తిరిగి వెళ్ళిపోయారు. నన్ను కట్టుకున్న మీరేమో ఇంట్లో కాలక్షేపం కావడం లేదంటూ ఎక్కువ సమయం బైట తిరిగొస్తున్నారు.

పెద్దకోడలు తల్లికి బావుండలేదని వెంటనే పుట్టింటికెళ్ళాలని అక్కడే నాలుగు నెలలుండి కంప్యూటరు కోర్సు నేర్చుకోవాలని అంతగా మనతో వాదించిన పిల్ల ఇప్పుడు నన్నీ స్థితిలో వదిలి ఎక్కడికీ వెళ్ళనంటోంది. నాకు పూర్తిగా తగ్గాకే వెళ్ళి, వాళ్ళమ్మను చూస్తానంటోంది. అక్కడ వాళ్ళమ్మను చూసుకోడానికి, తన వదినలున్నారంది. చూడండి మన కోడళ్ళు ఎలాంటివాళ్ళో! నిజంగా మనకు ఆడపిల్లలున్నా ఇంత బాగా, ఆలనా పాలనా చూసే వాళ్ళంటారా? మనం ఏనాడో పుణ్యం చేసుకున్నాం గనుకనే మంచి మనసున్న కోడళ్ళు దొరికారు మనకు. ఎన్ని జన్మలెత్తినా మనం వాళ్ళ ఋణం తీర్చుకోలేం. వయసులో చిన్నవాళ్ళయినా వాళ్ళిద్దరికీ చేతులెత్తి దండం పెట్టాలండీ. ఏవండీ! వాళ్ళదా చిన్న వయసు. భర్తల్తో సంసారం చేసుకునేవాళ్ళని ఎంతకాలమని మనదగ్గరుంచుకుంటాం? ఎన్నాళ్ళు పుట్టిళ్ళకు వెళ్ళకుండా ఆపుతాం? రేపే చిన్న కోడల్ని హైదరాబాదు, పెద్దకోడల్ని వాళ్ళ పుట్టింటికి పంపించెయ్యండి."

భర్తని నిలబడనివ్వలేదు సుబ్బరత్నం. ఇంకా షాకు నుండి తేరుకోని సుబ్బారావు హిప్నటైజ్ కాబడినవాడిలా అప్రయత్నంగానే లేచి అక్కడ్నుంచి కదిలాడు. అదంతా పక్క గదిలోంచి వింటున్న కోడళ్ళు కమల, విమలలకు అది కలా? నిజమా? తేల్చుకోలేక ఒకర్నొకరు గిచ్చుకుని నిర్ధారించుకున్నారు. అత్తగారిలో వచ్చిన మంచి మార్పుకు. వాళ్ళు ఆనందంతో వుక్కిరిబిక్కిరైపోయారు. ❋

## విజయదశమి పర్వాదినాల్లో వీరప్పన్ సంహారం



120 మందికి పైగా హత్యలు చేయడం, అటవీ సంపదను కొల్లగొట్టడం, వందలాది ఏనుగులను హతమార్చడం వంటి పరమ కిరాతక కృత్యాలు చేస్తూ తమిళనాడు, ఆంధ్ర-కర్ణాటక ప్రజల గుండెల్లో మహిషాసురునిలా నిలచి ప్రభుత్వాలకీ 500 కోట్లకు పైగా ఖర్చు చేయించిన, నరరూప రాక్షసుడు స్మగ్లర్ వీరప్పన్ అతని అనుచరులను శరన్నవరాత్రుల సమయంలో దుర్గాదేవి అంతమొందించింది. విజయకుమార్ అనబడే పోలీసు అధికారికి ఈ ఘనత దక్కింది. అక్టోబరు 18 న సోమవారం రాత్రి పదిన్నర, పదకొండు గంటల మధ్య కర్ణాటక, తమిళనాడు సరిహద్దుల్లోని సత్యమంగళం ప్రాంతంలో వీరప్పను హొగెనేకల్లు జలపాతాల దగ్గర తన సిబ్బందితో చాకచక్యంగా ఎస్.టి.ఎఫ్ బృందం గుర్తించింది. ముందుగా లొంగిపొమ్మని హెచ్చరించినా వినకుండా టాస్క్‌ఫోర్స్ బృందంపై కాల్పులు వీరప్పన్ ప్రారంభించడంతో ఇరుపక్షాలు కాల్పులు జరిపాయి.

ఈ కలియుగ నరకాసురుడ్ని ఎస్.టి.ఎఫ్ దళాల అధిపతి విజయకుమార్ నేతృత్వంలో ఎస్.టి.ఎఫ్. బృందం అంతమొందించారు.